క్లుప్తంగా

కుమారస్వామికి విశేషపూజలు



కుమారస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఈఓ, అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఈఓ ఎస్ లవన్న, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

మల్లన్న సేవలో తెలంగాణ హైకోర్టు జడ్జి



మల్లన్న దర్శనార్థం వెళ్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్లను తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు మంగళవారం వేకువజామున దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఆలయాధికారులు, అర్చకులు ఆలయమర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చకవేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివార్ల శేష వస్త్రాలు, లడ్డూప్రసాదాలను అందజేశారు.

అగ్ని ప్రమాదంలో గుడిసె దగ్ధం



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన గుడిసె

వెలుగోడు: పట్టణంలోని దాసరి వీధిలో మంగళవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో గుడిసె దగ్ధమైంది. వృద్ధురాలు జనాబీ నిద్రిస్తున్న సమయంలో ఆకస్మికంగా మంటలు చెలరేగడంతో ఇరుగు పొరుగు వారు వెంటనే ఆమెను కాపాడారు. అదృష్టవశాత్తు ప్రాణనష్టం జరగలేదు. వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. దాదాపు రూ.40 వేల ఆస్తినష్టం సంభవించి ఉండవచ్చని అంచనా. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ కిషోర్

నందికొటూరు: రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ (ఆర్.ఆర్.ఆర్) సెంటర్‌ను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కిషోర్ కోరారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే నెల 15వ తేదీ వరకు ఆర్.ఆర్.ఆర్ సెంటర్ అందుబాటులో ఉంటుందన్నారు. ఇళ్లల్లో నిరుపయోగంగా ఉన్న దుస్తులు, బూట్లు, చెప్పులు, టోపీలు, పరుపులు, బెడ్ షీట్లు, దుప్పట్లు, పుస్తకాలు, బ్యాగ్గులు, పిల్లలు ఆడుకునే బొమ్మలు, సైకిళ్లు, చెక్క కుర్చీలు, ఇనుప కుర్చీలు, టేబుల్స్, చెక్క మంచాలు, ఇనుప మంచాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, తదితర వస్తువులు సెంటర్‌లో అందించాలన్నారు. వాటిని అవసరమైన వారికి అందజేస్తామని చెప్పారు. నిరుపయోగంగా ఉన్న వస్తువులను ఇవ్వదలచినవారు ఏరియాలోని శానిటేషన్, ఎన్విరాన్ సెక్రటరీకి సమాచారం అందిస్తే వారు సెంటర్‌కు తరలిస్తారని చెప్పారు.

ఉపాధి కూలీలపై ఎంపీడీఓ ఆగ్రహం

పగిడ్యాల: తల్లిదండ్రులకు బదులు పిల్లలు ఉపాధి పనులకు హాజరు కావడంపై ఎంపీడీఓ వెంకటరమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పడమర ప్రాతకోట గ్రామంలో జరిగే పంట కాలువల పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల మస్టర్‌ను తనిఖీ చేసి తల్లిదండ్రులకు బదులుగా పిల్లలు నలుగురు హాజరైనట్లు గుర్తించి వెంటనే గైర్హాజరైనట్లు నమోదు చేశారు. జాబ్‌కార్డులో ఉన్న వ్యక్తులే పనులకు రావాలని వేరే వ్యక్తులు వచ్చి ప్రజంట్ వేసుకుంటే ఆ మేట్‌లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఓ మద్దిలేటి, ఇతర సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రగతి పథంలో శ్రీశైలం నియోజకవర్గం

- నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఎన్నో అభివృద్ధి పనులు
- అడిగిందే తడవుగా నిధులు మంజూరు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- తిరుమల తరహాలో శ్రీశైల క్షేత్ర అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్



శ్రీశైలం రింగ్‌రోడ్డు



నీటితో కళకళలాడుతున్న సిద్ధాపురం చెరువు

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి శ్రీశైలం నియోజకవర్గం అతి తక్కువ రోజుల్లోనే అభివృద్ధి పథంలో ముందుకు దూసుకెళ్తోంది. నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో స్థానిక ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి నియోజకవర్గం అభివృద్ధి కోసం అడగడమే తడవుగా ఎన్నో పనులను సీఎం మంజూరు చేయడంతో శ్రీశైలం నియోజకవర్గం ప్రగతి పథంలో పరుగులు తీస్తోంది.

శ్రీశైలంలో అభివృద్ధి పరుగులు

ఇల కైలాసంగా శోభిల్లుతున్న శ్రీశైలంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. నాలుగేళ్లలో రూపురేఖలు మారిపోయాయి. ఇప్పటికే రింగ్‌రోడ్డుతో సహా ఆలయం అభివృద్ధి వైపు దూసుకువెళ్తుంది. సుమారు రూ.136 కోట్లతో పనులు దాదాపు పూర్తి కానున్నాయి. రింగ్ రోడ్డు, సీసీ రోడ్లు, లలితాంబికా షాపింగ్, సిద్ధరామప్ప షాపింగ్‌కాంప్లెక్స్ , అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మాడవీధుల విస్తరణ, క్యూలైన్ల పనులు పూర్తయ్యాయి. మరిన్ని పనులు జోరుగా సాగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి శ్రీశైల క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు మాస్టర్‌ప్లాన్‌ను సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి అనుమతులు వస్తే తిరుపతి తరహాలో శ్రీశైలమహాక్షేత్రం అభివృద్ధి తథ్యం. శ్రీశైలమహాక్షేత్రంలో 10 ఎకరాల భూమిని మంజూరు చేయడంతో జగద్గురు పీఠాధిపతి ఆధ్వర్యంలో మెగా వైద్యశాల త్వరలో ఏర్పాటు కానుంది.

మున్సిపాలిటీగా ఆత్మకూరు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నగరపంచాయతీగా ఉన్న ఆత్మకూరు మున్సిపాలిటీగా కొత్తరూపులు దిద్దుకుంది. ఆత్మకూరు పట్టణంలో 4,200 మందికి పక్కాగృహాలు, ఇంటింటికీ కుళాయి కనెక్షన్ మంజూరుకు రక్షిత మంచినీటిని అందిస్తున్నారు. అద్దెభవనంలో కొనసాగుతున్న మున్సిపల్ కార్యాలయానికి స్థల సేకరణతో పాటు రూ.3 కోట్ల నిధులు మంజూరు చేసి నూతన మున్సిపల్ కార్యాలయం నిర్మిస్తున్నారు. అలాగే కోటి రూపాయలతో ఆర్టీసీ బస్టాండ్, మరో కోటితో మార్కెట్‌యార్డ్ గోడౌన్లు, రైతు బజార్, పట్టణశివారులోని పలు కాలనీల్లో సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రధానంగా మంచినీటి సమస్య రూపుమాపేందుకు కృషి జరుగుతోంది.

పుష్కలంగా రెండు పంటలు

నియోజకవర్గంలో తెలుగు గంగ , సిద్ధాపురం చెరువుతో పాటూ పలు గ్రామాల్లో చెరువులు, కేసీ కెనాల్, గాలేరు నదుల ద్వారా పుష్కలంగా సాగు నీరు అందిస్తున్నారు. టీడీపీ ప్రభుత్వంలో కరువుకాటకాలతో ఇబ్బందులు పడ్డ రైతన్నలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతో తెలుగు గంగ ప్రాజెక్ట్ నందు దాదాపు 16 టీఎమ్‌సీల నీటిని నిల్వ చేసి సాగు నీరు అందిస్తున్నారు. దీంతో రైతులు రెండు పంటలు పండిస్తున్నారు.

గ్రామాల్లో వ్యవసాయ గోడౌన్లు

వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది మండలాల్లో కూడా అభివృద్ధి పరుగు తీస్తోంది. నేడు రైతులు వరి పంటలు సాగు చేస్తూ జిల్లాలోనే అత్యంత పెద్ద ధాన్యాగార కేంద్రంగా ఈ ప్రాంతాల్లోని పలు గ్రామాల్లో వ్యవసాయ గోడౌన్ల ఏర్పాటు తో పాటూ రైతులకు కావాల్సిన అన్ని సౌకర్యాలతో ఆర్బీకే కేంద్రాలు, సచివాలయాలు, నూతన డిజిటల్ గ్రంథాలయాలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలతో గ్రామాలు రూపురేఖలు మారి అభివృద్ధి పథం వైపు దూసుకువెళ్తున్నాయి. ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి రూ.2 కోట్ల సొంత నిధులతో మహానంది క్షేత్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారు.

మేజర్ పంచాయతీగా సున్నిపెంట

నియోజకవర్గంలో సున్నిపెంటకు ఎంతో ప్రాధాన్యత ఉంది. అయితే పంచాయతీగా గుర్తింపు లేకపోవడంతో అభివృద్ధికి నోచుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సున్నిపెంటను మేజర్ గ్రామపంచాయతీగా ప్రకటించారు. 40 సంవత్సరాల సున్నిపెంట వాసుల కలలు నిజం చేశారు. నేడు రాష్ట్రప్రభుత్వం సున్నిపెంట వాసులకు పక్కాగృహాలతో పాటు సీసీ రోడ్లు ఏర్పాటు చేశారు. అలాగే స్థానిక ప్రజలు సంక్షేమ పథకాలు పొందుతున్నారు.



సున్నిపెంట గ్రామ సచివాలయం

జగనన్న పాలన రైతులకు స్వర్ణయుగమే



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన రైతులకు స్వర్ణయుగమే. తెలుగు గంగ, కేసీ కెనాల్ కింద ఈ ఏడాది రెండు పంటలు పండుతున్నాయి. ఇప్పటికే అన్ని ప్రాజెక్టుల్లో జలకల సంతరించుకుంది. దీనికి తోడు రైతులకు రూ.13 వేలు రైతు భరోసా కింద నిధులు మంజూరు చేశారు. ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో పలు అభివృద్ధి జరుగుతూ నియోజకవర్గం ముందుకు సాగుతుంది.

– సురేష్, కరివేన

అభివృద్ధిలో దూసుకెళ్తోంది



జగనన్న పాలన ప్రారంభమై ఇప్పటికి సరిగ్గా 4 ఏళ్లు గడిచింది. ఈ నాలుగేళ్లలో శ్రీశైలం నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకెళ్తోంది. ప్రధానంగా గ్రామాలు అభివృద్ధి వైపు పరుగులు తీస్తున్నాయి. గ్రామ సచివాలయాలు, రైతులు భరోసా కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఇలా ఎన్నో నూతన కార్యాలయాలతో పాటూ ప్రజల వద్దకే పథకాలు అందిస్తుండటంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

– రామకృష్ణారెడ్డి, కృష్ణాపురం

గ్రామాల వారీగా వలంటీర్లకు వందనం

పాములపాడు: మండలంలోని ప్రతి గ్రామ వలంటీర్లకు వందనం కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎంపీడీఓ సుమిత్రమ్మ అన్నారు. ఈ నెల 24న బానుముక్కల, బానకచెర్ల, వేంపెంట పంచాయతీల వారికి వేంపెంట సచివాలయం, 25న మిట్టకందాల, మద్దూరు, వానాల గ్రామాల వారికి మద్దూరు సచివాలయం, 26న యర్రగూడూరు, ఇస్కాల, 27న పాములపాడు 1, పాములపాడు-2(రుద్రవరం), చెలిమిల్ల గ్రామాల వారికి ఎంపీడీఓ కార్యాలయంలో సన్మాన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

కొత్తపల్లి ఇన్‌చార్జ్ ఎస్‌ఐగా హుస్సేన్‌బాషా



ఆత్మకూరు: ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలోని కొత్తపల్లి మండలం ఇన్‌చార్జ్ ఎస్‌ఐగా హుస్సేన్‌బాషాను నియమిస్తూ అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తపల్లిలో పనిచేస్తున్న ఎస్‌ఐ మొబినాతాజ్ ను అన్నమయ్య జిల్లాలో రిపోర్ట్ తీసుకోవాల్సిందిగా అధికారులు పేర్కొన్నారు. దీంతో ప్రస్తుతం ఆత్మకూరు లో విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ హుస్సేన్‌బాషాకు కొత్తపల్లి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

జూపాడుబంగ్లాలో 14.2 మి.మీల వర్షం

జూపాడుబంగ్లా: సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం వరకు నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా, పగిడ్యాల మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. జూపాడుబంగ్లా మండలంలో 14.2 మిల్లీమీటర్లుగా నమోదుకాగా, పగిడ్యాల మండలంలో 4.8 మిల్లీమీటర్లుగా వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ హనుమంతు మంగళవారం తెలిపారు.

వైభవంగా ప్రతిష్ఠోత్సవాలు

మహానంది: బండిఆత్మకూరు మండలం సోమయాజులపల్లె గ్రామంలో శ్రీ గణపతి అన్నపూర్ణ సమేత శ్రీ కాశీ విశ్వనాథస్వామి, శ్రీ సీతా లక్ష్మణ హనుమత్సమేత శ్రీ రామచంద్ర, సుబ్రహ్మణ్యస్వామి, లింగమయ్య స్వామి విగ్రహ, ధ్వజ ప్రతిష్ఠ మహోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామ పెద్దలు, ప్రజలు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి రాత్రి వరకు విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం అధివాస హోమాలు, ధాన్యాధివాసం, తీర్థప్రసాదాల వినియోగం పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. బుధవారం యంత్రస్థాపనలు, విగ్రహ ప్రతిష్ఠ, రక్షా, శాంతి హోమాలు, మహాపూర్ణాహుతి పూజలు ఉంటాయని కమిటీ సభ్యులు తెలిపారు.

గుజరాత్ నుంచి స్ఫటికలింగం

ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా శ్రీ కాశీ విశ్వనాథస్వామి స్ఫటిక లింగాన్ని గుజరాత్ నుంచి తెప్పించినట్లు గ్రామపెద్దలు తెలిపారు. కాశీలో మండల దీక్షరోజులు పూజలు నిర్వహించి ప్రతిష్ఠకు తెచ్చినట్లు చెప్పారు.

గాజులపల్లెలో కుంటెమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠ పూజలు



.గాజులపల్లెలో అమ్మవారి విగ్రహప్రతిష్ఠ పూజలు చేసిన దృశ్యం

గాజులపల్లె గ్రామంలో పెద్దమ్మ జాతర జరిగిన 22 రోజుల తర్వాత మంగళవారం కుంటెమ్మ దేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు వైభవంగా జరిగాయి. జాతర అనంతరం ఇరవై రెండ్రోజులకు కుంటెమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని గ్రామ పెద్దలు తెలిపారు. అందులో భాగంగా ఎస్సీ కాలనీ వాసుల ఆధ్వర్యంలో వేడుకలు వైభవంగా జరిగాయి.

పర్యాటక కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలపరిశీలన చేస్తున్న ఆర్డీఓ, తహసీల్దార్

కొత్తపల్లి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మండలంలోని సంగమేశ్వరం సమీపంలో ఏర్పాటు చేయనున్న పర్యాటక కేంద్రం కోసం స్థలపరిశీలన చేస్తున్నామని ఆత్మకూరు ఆర్డీఓ దాసు తెలిపారు. మంగళవారం తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్‌తో కలసి సంగమేశ్వరం సమీపంలో భూములను పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో సంగమేశ్వరం వద్ద తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలుపుతూ కృష్ణానదిపై ఐకానిక్ వంతెన నిర్మించబోతున్నారన్నారు. అందులో భాగంగానే సంగమేశ్వరం వద్ద పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు పర్యాటక కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పీఓఎల్ఆర్ డీటీ పెద్దన్న, మండల సర్వేయర్ రాజశేఖర్, వీఆర్వోలు మౌలాలి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

కౌలురైతు అవగాహన సదస్సు

కొత్తపల్లి: గువ్వలకుంట్ల గ్రామంలో కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రంపై ఏఈఓ వెంకటనారాయణ, వ్యవసాయ సహాయకుడు జాహీద్, వీఆర్వో కృష్ణారెడ్డిలు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులకు కౌలు కార్డు (పంట సాగు ధ్రువీకరణ పత్రం) తీసుకోవడం పొందడం వలన కౌలు రైతులకు రైతు భరోసా, ఇన్పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, సున్నా వడ్డీ రుణాలు వంటి పథకాలు ప్రభుత్వం ద్వారా అందుతాయని వివరించారు.

సురక్షిత నీరు అందించడమే లక్ష్యం

మిడుతూరు: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సురక్షిత నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విమల అన్నారు. మంగళవారం మండలపరిధిలోని తిమ్మాపురం గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయించారు. కార్యక్రమంలో ఏఈ విశ్వనాథ్, పీఎస్ ఫరీద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు రద్దు చేయాలి

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రాజెక్ట్ కాలనీలో నివసిస్తున్న ప్రజలు బకాయిలు చెల్లించాలని జలవనరుల శాఖ అధికారులు ఆదేశించడంపై మంగళవారం అఖిల పక్ష నాయకులు మండల తహసీల్దార్ రాజేంద్రసింగ్, జలవనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరావులతో చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం సున్నిపెంట గ్రామాన్ని గ్రామపంచాయతీగా ప్రకటిస్తూ ఈ నెల 11న జీఓ నెంబర్ 40ని జారీ చేసిందని, పాత బకాయిలు రద్దు చేసి ఇకపై గ్రామ పంచాయతీ పన్నులు వసూలు చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పులిరాజు, వై.ఆశీర్వాదం ,సాయి, ఓబులయ్య, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే బ్రిడ్జి నిర్మాణ పనులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏఈ శ్రీనివాసనాయక్

పాములపాడు: కేసీ కెనాల్ పై బ్రిడ్జి పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని కేసీసీ ఏఈ శ్రీనివాస నాయక్ తెలిపారు. మంగళవారం మండలంలోని జూటూరు గ్రామ పంచాయతీ మజరా కోల్స్ ఆనందాపురం గ్రామంలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న కేసీ వంతెన విషయాన్ని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఈ మేరకు అంచనాలు సిద్ధం చేయాలని సీఎం క్యాంప్ ఆఫీసు నుంచి వచ్చిన పత్రాన్ని చూపించారు. అలాగే సీపీఎం నాయకుడు వెంకటేశ్వరరావు కూడా స్పందన అర్జీ ఇచ్చారన్నారు. గతంలో నిర్మించిన వంతెనను క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించిన పిదప నాణ్యతపై వారిచ్చే సర్టిఫికెట్ ఆధారంగా నూతనంగా అంచనాలు సిద్ధం చేయాలా, లేదంటే ఇప్పటికే నిర్మాణంలో ఉన్న పిల్లర్ల పై నిర్మాణం చేపట్టాలో నిర్ణయిస్తామన్నారు. ఆయన వెంట వైఎస్ఆర్‌సీపీ నాయకులు ఉపేంద్ర, జనార్దన్ ఉన్నారు.

వలంటీర్ వ్యవస్థతో ఇళ్లకే సంక్షేమ ఫలాలు



నందికొట్కూరులో వలంటీర్లను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి



తుమ్మలూరులో వలంటీర్‌ను సన్మానిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి రామలింగేశ్వరరెడ్డి



వేల్పనూరులో వలంటీర్ నబిరసూల్‌ను సేవా వజ్ర అవార్డుతో సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ ఫలాలు వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటి వద్దే అందుతున్నాయని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో 3, 4 సచివాలయ వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర ఉత్తమ సేవ అవార్డులు కమిషనర్ కిషోర్, కౌన్సిలర్లు అల్లూరి కృష్ణ, చాంద్‌బాషాతో కలిసి అందజేశారు.

వలంటీర్లు సంక్షేమ సారథులు

నందికొట్కూరు రూరల్: స్వచ్ఛందంగా ప్రజలకు సేవ చేస్తున్న వలంటీర్లు సంక్షేమ సారథులని ఎంపీపీ మురళీక్రిష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కోనేటమ్మపల్లి గ్రామంలో అధికారులు వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు కార్యక్రమంలో ఈవోఆర్డీ సుబ్రమణ్యంశర్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ఎనలేనివి

పాములపాడు: గ్రామాల్లో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తున్న గ్రామ వలంటీర్ల సేవలు ఎనలేనివని జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతిరామలింగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తుమ్మలూరు గ్రామంలోని సచివాలయంలో సర్పంచు వరప్రసాద్ అధ్యక్షతన వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ కరుణ సాగర్, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు రామలింగేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



అవార్డులు పొందిన చింతలపల్లి సచివాలయ వలంటీర్లు

వలంటీర్లు నిజమైన సంక్షేమ సేవకులు

వెలుగోడు : గ్రామ, వార్డు వలంటీర్లు నిజమైన సంక్షేమ సేవకులని ఎంపీపీ లాలం రమేష్ కొనియాడారు. వేల్పనూరు గ్రామంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన దూదేకుల నబిరసూల్ అనే వలంటీర్ సేవా వజ్ర అవార్డును అందించారు. మిగతా 29 మంది వలంటీర్లకు సేవా మిత్ర అవార్డులు అందజేశారు. ఎంపీటీసీ బన్నూరు తోయజనాభారెడ్డి సొంత నిధులతో ప్రత్యేక ప్రోత్సాహక బహుమతులు వలంటీర్లకు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ అమానుల్లా, ఎంపీటీసీ సభ్యులు పల్లె వెంకట్రామిరెడ్డి, సర్పంచ్ సర్దార్ మియా, నాయకులు బన్నూరు సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

మిడుతూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో సంక్షేమ పథకాలను అవినీతి, అక్రమాలకు తావులేకుండా ప్రజలకు చేరవేస్తూ ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచుతున్న గ్రామ వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని ఈఓఆర్డీ పక్రుద్దీన్, కార్యాలయ ఏఓ దశరథరామయ్య అన్నారు. మంగళవారం మండలపరిధిలోని దేవనూరు, చింతలపల్లి గ్రామ సచివాలయ వలంటీర్లకు వేర్వేరుగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవనూరు గ్రామ సర్పంచ్ హరిత, కో-ఆప్షన్ మెంబర్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి

జూపాడుబంగ్లా: ప్రజల సౌకర్యార్థం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న మొబైల్ ఆధార్‌సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మంజులవాణి సూచించారు. ఈనెల 24 పారుమంచాల, తంగడంచ, 25న తరిగోపుల,భాస్కరాపురం,30న పి.లింగాపురం, తర్తూరు , 31న తాటిపాడు, మండ్లెం గ్రామ సచివాలయాల్లో ఆధార్‌కేంద్రాలను ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

మిడుతూరు: జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలను వేగవంతం చేసుకునేలా లబ్ధిదారులకు చైతన్యం కల్పించాలని హౌసింగ్ డీఈ ప్రభాకర్ సూచించారు. మంగళవారం నాగలూటి గ్రామ సచివాలయంలో సిబ్బందితో ఇంటి నిర్మాణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. డీఈ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు చేరువ కావాలంటే అన్ని శాఖల అధికారులతో భాగస్వామ్యం చేసుకుంటే సాధ్యమవుతుందన్నారు.

అసిస్టెంట్ లైన్‌మెన్ మృతి



మురళీమోహన్‌రెడ్డి(ఫైల్)

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్ గ్రామానికి చెందిన అసిస్టెంట్ లైన్‌మెన్ మురళీమోహన్‌రెడ్డి(42) అనారోగ్యం బారినపడి మృతి చెందారు. నందికొట్కూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అసిస్టెంట్ లైన్‌మెన్(ఆపరేషన్స్) విధులు నిర్వహించే మురళీమోహన్‌రెడ్డి కొద్ది రోజుల క్రితం లివర్ సంబంధిత వ్యాధి బారినపడ్డాడు. ఆదివారం తీవ్ర అస్వస్థతకు గురికాగా కుటుంబీకులు నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక తుది శ్వాస విడిచారు.

పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వండి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న లబ్ధిదారులు

పాములపాడు: ఇల్లు నిర్మించుకుంటాం పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వండి అని గృహ నిర్మాణ లబ్ధిదారులు తహసీల్దార్ రత్నరాధికను కోరారు. మంగళవారం మండలంలోని తుమ్మలూరు గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ప్రధానంగా గ్రామంలో పొజిషన్ సర్టిఫికెట్ సమస్యతో దాదాపు 30 మంది ఇంటి నిర్మాణానికి నోచుకోలేకపోతున్నారని వైఎస్ఆర్‌సీపీ నాయకుడు రామలింగేశ్వరరెడ్డి అభ్యర్థన మేరకు గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన తహసీల్దార్ మాట్లాడుతూ వారసులకు గ్రామ కంఠం లో ఉన్న వారికి సర్టిఫికెట్ మంజూరు చేస్తామన్నారు. అయితే డీ.పట్టా, అగ్రి మెంటులతో స్థలాలు కొనుగోలు చేసిన వారికి ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక



గోకులం షెడ్ల బిల్లుల సమస్యను అధికారులకు వివరిస్తున్న జెడ్పీటీసీ సోమలసుధాకర్ రెడ్డి

కొత్తపల్లి: మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో వివిధ శాఖల్లో జరిగిన పనులపై మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఇందులో సామాజిక తనిఖీ బృందం సభ్యులు పనుల్లో అవకతవకలపై అధికారులకు నివేదికలు అందించారు. డ్వామా పీడీ రామచంద్రా రెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి సిద్దలింగ మూర్తి, ఏపీడీలు అన్వారా బేగం, సలీమ్ బాషాలు నివేదికలను సామాజిక తనిఖీ ఎస్ఆర్పీ నీలకంఠ ఆధ్వర్యంలో పరిశీలించి గ్రామపంచాయతీల వారీగా పనుల్లో జరిగిన అవకతవకలను వెల్లడించారు. పనుల్లో జాప్యం, అవకతవకలకు పాల్పడిన టెక్నికల్ అసిస్టెంట్లకు అధికారులు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. పీడీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మండలంలో 2022-23 సంవత్సరంలో 601 పనులకు ప్రభుత్వం రూ. 7,05,10,265 ఖర్చుచేసింది. ఇందులో సామాజిక తనిఖీ బృందం చేసిన తనిఖీల్లో సంబధిత ఎస్ఆర్ ఈజీఎస్ సిబ్బంది నుంచి రీకవరీగా రూ.7103, పెనాల్టీగా రూ.23500, పనుల కొలతల్లో తప్పులు చేసినందుకు రూ.72542, హార్టికల్చర్ క్రింద రీప్లాంటేషన్ చేసేందుకు రూ.7,52,016 అవకతవకలకు పాల్పడ్డారని చెప్పారు. అక్రమాలకు పాల్పడ్డ సిబ్బంది ఈ మొత్తాన్ని వెంటనే చెల్లించాలని ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మేరి, జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, ఎంపీపీ కె.కుసుమలత, కోర్సు డైరెక్టర్ ఏసుదాసు, ఏపీఓలు రేష్మా తదితరులు పాల్గొన్నారు.